క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని 50వ డివిజన్ కార్పొరేటర్ గంజి విజయలక్ష్మి తదితరులు మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలను తెలియజేశారు.

- ఎమ్మెల్సీని 49వ డివిజన్‌కు చెందిన పార్టీ నేతలు ప్రభాకర్, కొండలరావు, జబ్బార్, అన్వర్, అజీజ్ తదితరులు కలిశారు.

మతిస్థిమితం లేని మహిళపై దాడి

నెల్లూరు(క్రైమ్): మతిస్థిమితం లేని మహిళపై యువకుడు దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి వెలుగులోకి వచ్చింది. వివరాలు.. కోటమిట్ట సమీపంలోని ఆనం వెంకటరెడ్డి మున్సిపల్ క్వార్టర్స్ పరిసర ప్రాంతాల్లో మతిస్థిమితం లేని ఓ మహిళ కొంతకాలంగా తిరుగుతూ దుకాణాల అరుగుల వద్ద రాత్రివేళ నిద్రించేవారు. పది రోజుల క్రితం అర్ధరాత్రి వర్షం పడుతుండగా ఆమెపై ఓ యువకుడు దాడి చేశారు. కుక్కలు అరుస్తుండటంతో అక్కడి నుంచి పరారయ్యారు. ఘటన సీసీ కెమెరాల్లో రికార్డయింది. సామాజిక మాధ్యమాల్లో ఇది వైరలైంది.

కాకాణికి అభినందనల వెల్లువ



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నేతలు శుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం ఆయన్ను సత్కరించారు.

పాఠశాల ఆధునికీకరణ కమిటీకి సత్కారం



నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని నిత్యానంద సరస్వతి వేద సంస్కృత పాఠశాలను ఆధునికీకరించామని పాఠశాల ఈఓ దర్గయ్య తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆధునికీకరణ కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు. కొండా ప్రవీణ్ శంకర్, నందకిషోర్, పాబోలు రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్‌లకు పోటీతత్వం పెరగాలి

- ఎక్సైజ్ సీఐ కిశోర్

కోవూరు : మద్యం దుకాణాల లైసెన్స్‌ల కోసం పోటీతత్వం పెరగాలని, ఈ క్రమంలో దరఖాస్తులు అధిక సంఖ్యలో దాఖలు చేయాల్సిందిగా పొదలకూరు ఎక్సైజ్ సీఐ కిశోర్ అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. లైసెన్స్ పొందిన వారు ఏడాదికి ఆరు విడతల్లో లైసెన్స్ ఫీజు చెల్లించవచ్చన్నారు. షాపుల ఏర్పాటులో గతంలో ఉన్న నిబంధనలే అమలవుతాయని, ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటలకు దరఖాస్తుల స్వీకరణ పూర్తవుతుందని తెలియజేశారు. 11న లాటరీ పద్ధతిలో షాపుల కేటాయింపు ఉంటుందన్నారు. కోవూరు ఎక్సైజ్ పరిధిలో కోవూరు, కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాలు ఉన్నాయని, వాటి పరిధిలో 21 మద్యం దుకాణాలను ఏర్పాటు చేయనున్నారన్నారు. కోవూరులో 6, కొడవలూరులో 5, విడవలురులో 4, అల్లూరులో 6 దుకాణాలకు అనుమతి ఉందన్నారు. ఒక్క వ్యక్తి ఎన్ని దుకాణాలకు అయిన దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కామాక్షితాయికి బంగారు హారం బహూకరణ



కాసుల హారాన్ని ఈఓకు అందజేస్తున్న భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారికి బంగారు లక్ష్మీ కాసుల హారాన్ని భక్తులు ఆదివారం బహూకరించారు. తిరుపతికి చెందిన ఎల్.సత్యనారాయణ, వెంకట శోభాలక్ష్మి దంపతులు కామాక్షితాయి అమ్మవారికి సుమారు 52 గ్రాముల 184 మిల్లీగ్రాముల హారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి దాతలకు స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నో క్యాష్

జిల్లాలో శని, ఆదివారాల్లో చాలాచోట్ల ఏటీఎంలు నో క్యాష్ బోర్డులతో దర్శనమిస్తున్నాయి. మరికొన్ని టెంపరరీ అవుట్ ఆఫ్ సర్వీస్ అని చూపిస్తున్నాయి. దీంతో ఆ రెండు రోజుల్లో నగదు అవసరమైన వినియోగదారులు వీధి వీధి తిరుగుతూ తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీనికితోడు కొన్ని ఆన్‌లైన్ యాప్‌లు సైతం ఆ రోజుల్లో సర్వర్ బిజీ అని వస్తుండటంతో ప్రజలు విసిగి పోతున్నారు.

- శని, ఆదివారాల్లో మొరాయిస్తున్న ఏటీఎంలు
- ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో బ్యాంక్ సర్వర్ల బిజీ
- ఈ రెండు రోజుల్లోనే ఎక్కువగా సమస్య
- జిల్లా అంతటా ఇదే పరిస్థితి



ఏటీఎం

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో వివిధ బ్యాంకులకు సంబంధించి 395 శాఖలున్నాయి. వీటికి అనుబంధంగా సుమారు 450 వరకు ఏటీఎంలున్నాయి. సాధారణంగా ఎవరైనా నగదు కోసం బ్యాంక్‌కు వెళ్తే, అధికారులు మాత్రం ఏటీఎంను వినియోగించుకోవాలని సూచిస్తుంటారు. తీరా వాటి వద్దకెళ్తే మాత్రం నిరాశే ఎదురవుతోంది. కొన్నింటిలో నగదు ఉండటం లేదు. మరికొన్ని చోట్ల డబ్బున్నా మెషీన్లు పనిచేయడం లేదు. పలుచోట్ల నో సర్వర్ అనే మెసేజ్ కనిపిస్తోంది. ఆర్బీఐ నిబంధనల మేరకు రెండు గంటల కన్నా ఎక్కువ సేపు ఏటీఎంలో నగదు లేకపోతే వాటి నిర్వాహకులకు పెనాల్టీ విధిస్తుంటారు. అయితే ఈ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. వీరిపై కఠినంగా వ్యవహరిస్తే ఏటీఎంలు సక్రమంగా పనిచేసే అవకాశముందనే అభిప్రాయం జనంలో ఉంది. మరోవైపు ఏటీఎం సెంటర్లలో ఏసీలను తప్పక ఏర్పాటు చేయాలి. అన్నింట్లో ఉన్నా, 75 శాతానికి పైగా అవి పనిచేస్తున్న దాఖలాల్లేవు.

పరిశీలిస్తాం

ఏటీఎంలలో నగదు తప్పకుండా ఉండాలి. లేని పక్షంలో ఆర్బీఐ నిబంధనల మేరకు ఆయా బ్యాంక్‌లకు పెనాల్టీ పడుతుంది. అన్నింటినీ పరిశీలించి తగిన చర్యలు చేపడతాం. స్మార్ట్ ఫోన్లలో నగదు లావాదేవీలకు సంబంధించి వాడే యాప్‌లకు ప్రత్యేక సర్వర్ ఉంటుంది.

– శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్, లీడ్ బ్యాంక్ మేనేజర్

యాప్‌లూ అంతే..

ప్రస్తుతం చిన్న మొత్తాల్లో లావాదేవీలకు అనేక మంది స్మార్ట్‌ఫోన్లలో గూగుల్ పే, ఫోన్ పే, క్రెడ్ తదితర యాప్స్‌పై ఆధారపడ్డారు. బ్యాంక్‌లు కూడా యాప్‌ల ద్వారా సేవలందిస్తున్నాయి. అయితే ఇవి కూడా శని, ఆదివారాల్లో సక్రమంగా పనిచేయడం లేదు. మీ బ్యాంక్ సర్వర్ ప్రస్తుతం బిజీగా ఉందనే మెసేజ్ దర్శనమిస్తోంది. చేతిలో నగదు పెట్టుకోకుండా షాపింగ్‌కు వెళ్లిన వారు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది. ప్రధానంగా ఆన్‌లైన్లోనే నగదు లావాదేవీలు చేయాలని వాటి అధికారులు సూచిస్తున్నారు. అయితే అందుకు తగిన విధంగా సేవల్లేకపోవడంతో వినియోగదారులకు ఇక్కట్లు తప్పడం లేదు.

నూతన కార్యవర్గ ఎన్నిక



నూతన కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం

నెల్లూరు(అర్బన్): నగరంలోని కల్యాణ రెసిడెన్సీ ప్రాంగణంలో ఏపీ హెల్త్ ఎడ్యుకేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా మలినేని భానుమూర్తి (గుంటూరు), రాష్ట్ర అధ్యక్ష, జనరల్ సెక్రటరీలుగా వెంకటరమణ (నంద్యాల), చేజర్ల సుధాకర్‌రావు (నెల్లూరు), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జయప్రకాష్ (కడప), కోశాధికారిగా హరిప్రసాద్ (నెల్లూరు), రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సయ్యద్ బేగం (విశాఖపట్నం), రాజేంద్రకుమార్ (కృష్ణా), మహమ్మద్ రఫీ (చిత్తూరు), శివరామకృష్ణ (విశాఖపట్నం), విజయభాస్కర్ (ప్రకాశం), మహిళా విభాగ రాష్ట్ర సెక్రటరీగా సరోజిని, జాయింట్ సెక్రటరీలుగా వెంకటరమణ (అనంతపురం), పద్మావతి (కర్నూలు), ఉమా సీతామహాలక్ష్మి, టాటాబాయి, ధనలక్ష్మి, వెంకటగిరి, బాబు, సునీత్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా అనిల్‌కుమార్, అనూరాధ, విజయకుమార్, సత్యవతి, తులసీ, వంశీ, సుమతి, మంగమ్మ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

వేదగిరి లక్ష్మీనృసింహుడి సేవలో..



నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి అమ్మవారిని ఎన్నికల కమిషన్, ఏపీ జాయింట్ సెక్రటరీ సాయిప్రసాద్ సతీసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ వేమూరి గోపీ, ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, అప్పలాచార్యులు, మురళీధరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి



సమస్యలను ఆరాతీస్తున్న ఖాజావలీ

నెల్లూరు(బృందావనం): కొత్తూరు న్యూ జర్నలిస్ట్ కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఓఎస్డీ ఖాజావలీ పేర్కొన్నారు. న్యూ జర్నలిస్ట్ కాలనీలో తరచూ ఏర్పడుతున్న విద్యుత్ అంతరాయం, చోరీలు, సమీపంలోని మల్లయ్య గుంట వాసులు పడుతున్న ఇబ్బందులపై సాక్షిలో ఇటీవల కథనం ప్రచురితమైంది. ఈ తరుణంలో మంత్రి ఆదేశాల మేరకు ఓఎస్డీ, ఏఈ రమణారెడ్డి తదితరులు కాలనీకి విచ్చేశారు. ఈ సందర్భంగా ఖాజావలీ మాట్లాడారు. ఏ సమస్యొచ్చినా తమకు తెలియజేస్తే మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం



సీపీఎం నేతల సమావేశం

నెల్లూరు(అర్బన్): ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు తప్పనిసరని సీపీఎం నేత కొండా ప్రసాద్ పేర్కొన్నారు. బుజబుజ నెల్లూరులోని జక్కా వెంకయ్య కార్యాలయంలో పార్టీ నేతలతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుకను అందుబాటులోకి తీసుకొచ్చి భవన నిర్మాణ కార్మికుల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలన్నారు. కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్నకు నివాళి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న వర్ధంతిని నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సంఘ రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ మాట్లాడారు. 50 ఏళ్లు నిండిన చేతి వృత్తిదారులకు పింఛన్‌ను మంజూరు చేయాలని కోరారు. చంద్రగిరి రమణయ్య, బాలవెంకటేశ్వర్లు, నాగార్జున, హర్షవర్ధన్, అనంతయ్య, తిరుపాల్, ప్రవీణ్‌కుమార్, వెంకట్రావ్, ప్రసాద్‌కుమార్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాల అందజేత



నెల్లూరు(బృందావనం): శాంతినగర్‌లోని నిర్మల సౌధలో రెడ్ల ఐక్యవేదిక విజయోత్సవ సభను ఐక్యవేదిక అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. దక్షిణ కొరియాలో నిర్వహించిన ప్రపంచ సాకర్ పోటీల్లో అద్భుత ప్రదర్శన కనబర్చిన ఎద్దల పూజితరెడ్డిని సత్కరించి, ప్రోత్సాహకంగా రూ.85 వేలను అందజేశారు. అదే విధంగా ఈమెకు రూ.25 వేలను కొండా నిరంజన్‌రెడ్డి ఇచ్చారు. పర్వతరెడ్డి అభినయరెడ్డి చదువుకునేందుకు గానూ రూ.48 వేలను డాక్టర్ కృష్ణారెడ్డి అందజేశారు. రెడ్ల మేథోమదన సదస్సు విజయవంతమయ్యేందుకు సహకరించిన వారిని సత్కరించారు. ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ బీవీ రెడ్డి, హైటెక్ రమణారెడ్డి, కాటంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, గుండాల ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీతారామస్వామి మందిరంలో..



కామిశెట్టి మహాలక్ష్మి దేవస్థానంలో..



వెంకటేశ్వరపురంలో..



రాజరాజేశ్వరి ఆలయంలో భక్తులు



ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో..

అన్నపూర్ణే.. సదాపూర్ణే

నెల్లూరు(బృందావనం): సింహపురిలో శరన్నవరాత్రి శోభ నెలకొంది. ఉత్సవాలను పురస్కరించుకొని నగరంలోని వివిధ ఆలయాల్లో జగన్మాతకు విశేష పూజలను ఆదివారం నిర్వహించారు. అమ్మవారు వివిధ అలంకారాల్లో కొలువుదీరి భక్తులను కటాక్షిస్తున్నారు.

- రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణగా దర్శనమిచ్చారు. లలితా కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉభయకర్తలుగా దేవిరెడ్డి శైలజ, కృష్ణప్రసాద్, సుహాసిని, నాగం మల్లికార్జునరెడ్డి, అమూల్య వ్యవహరించారు.
- మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు అన్నపూర్ణగా దర్శనమిచ్చారు. నవావరణ పూజ, పుష్పాలంకారం, చండీ హోమాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా అల్లూరు రఘురామయ్య, వెంకటకృష్ణమ్మ, మాగుంట రాహుల్‌సేన్‌రెడ్డి, కవిత, బత్తిన కుమారస్వామిరెడ్డి, లక్ష్మి దంపతులు వ్యవహరించారు.
- నవాబుపేటలోని ద్రౌపతీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో అమ్మవారు అన్నపూర్ణగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పోట్లపూడి అంజయ్య, మైపాటి గున్నయ్య, సాదా వెంకటసుబ్బయ్య తదితరులు వ్యవహరించారు.
- సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు భవానిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా దొడ్ల కృష్ణ, శ్రీలక్ష్మి, పచ్చిపాల ఫణికుమార్‌రెడ్డి, స్వర్ణలత దంపతులు వ్యవహరించారు.
- మూలాపేటలోని ద్రౌపతీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో అమ్మవారు త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కృష్ణ ప్రసాద్, వసుంధర దంపతులు వ్యవహరించారు.
- స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు. మూలవర్లను లక్ష గాజులతో అలంకరించారు. ఉభయకర్తలుగా కోట సూర్యనారాయణ, లక్ష్మీకుమారి దంపతులు వ్యవహరించారు.
- కోదండరామపురంలోని మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారు గజలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కొమ్మూరు లీలామోహన్, సుప్రజ, శ్రీధర్‌కుమార్, పుష్పాంజలి, నాతా రాజమోహన్, పద్మలత, రాజేంద్రప్రసాద్, సుగుణ, రాజశేఖర్, లీలావతి దంపతులు వ్యవహరించారు.
- బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో అమ్మవారు గజలక్ష్మిగా దర్శనమిచ్చారు. అభిషేకం, ధనలక్ష్మీ హోమం, కుంకుమపూజ, అష్టలక్ష్మీ వైభవాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా చందలూరి నాగేంద్రరావు, శేషగిరిరావు, సుధాకర్‌రావు దంపతులు వ్యవహరించారు.
- విరాట్‌నగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో అమ్మవారు రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కాకులూరు రమేష్‌ఆచారి, ఉమామహేశ్వరి, వసంతకుమార్, కర్పకవల్లి, మధిర కృష్ణ, రోజా, వయ్యావూరు రమణయ్య, సంపూర్ణ దంపతులు వ్యవహరించారు.
- మహాత్మాగాంధీనగర్‌లోని కృష్ణ మందిరంలో గల వైభవలక్ష్మి ఆలయంలో అమ్మవారు ధాన్యలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా రాఘవేంద్ర, శైలజ, దంపతులు వ్యవహరించారు.
- నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు భువనేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కొణిజేటి రాధాకృష్ణయ్య, వెంకటసుబ్బరత్నమ్మ, వరప్రసాద్, లక్ష్మి దంపతులు వ్యవహరించారు.
- సుజాతమ్మ కాలనీలోని అష్టలక్ష్మి మందిరంలో అమ్మవారు మీనాక్షిదేవిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా శరత్‌కుమార్‌రెడ్డి, నిశ్చల, రవికుమార్, వాణి దంపతులు వ్యవహరించారు.



ధర్మరాజస్వామి దేవస్థానంలో..



మల్లేశ్వరస్వామి దేవస్థానంలో..

- సంతపేట కంసాలివీధిలోని భ్రమరాంబ సమేత హరిహరనాథస్వామి దేవస్థానంలో అమ్మవారు గజలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా సగటూరి నిరంజన్‌బాబు, విజయలక్ష్మి దంపతులు వ్యవహరించారు.
- నవాబుపేటలోని కామిశెట్టి మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారు పార్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పారా శ్రీధర్‌శర్మ, సావిత్రి దంపతులు వ్యవహరించారు.


నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వెంకటేశ్వరపురంలో కొలువైన వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారు కృష్ణావతారంలో దర్శనమిచ్చారు. అన్నమాచార్య సంకీర్తనలను అనుశ్రుతి ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉభయకర్తలుగా చల్లా రవికుమార్, లత దంపతులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ నాగిరెడ్డి, ఆలయ ప్రధానార్చకుడు సాయిభరద్వాజ తదితరులు పాల్గొన్నారు.



మహాలక్ష్మి దేవస్థానంలో..




వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో..



అష్టలక్ష్మి మందిరంలో..



వైభవలక్ష్మి ఆలయంలో..



హరిహరనాథస్వామి దేవస్థానంలో..